01-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

“మధురమైన పిల్లలూ - దేహ సహితంగా అందరి స్మృతిని మరచి, తండ్రి ఎవరో, ఎలా ఉన్నారో వారిని యథార్థముగా గుర్తించి స్వయాన్ని బిందువుగా భావించి బిందు రూపములో తండ్రిని స్మృతి చెయ్యండి”

ప్రశ్న:- ఏ జ్ఞానము ఈ సమయంలో తండ్రి నుండి మాత్రమే మీకు లభిస్తుంది, ఇతరులెవ్వరూ ఇవ్వలేరు?

జవాబు:- స్త్రీ-పురుషులైన మీరు కలిసి ఉంటూ గృహస్థ వ్యవహారాన్ని సంభాళిస్తూ పవిత్రంగా ఉండండి, ఈ జ్ఞానాన్ని ఇప్పుడు ఈ సమయంలోనే తండ్రి మీకు ఇస్తారు, ఇతరులెవ్వరూ ఈ జ్ఞానాన్ని ఇవ్వలేరు. మీరు 5 వికారాలను దానం చెయ్యాలి కానీ ముఖ్యమైనది కామము, దానిపై పూర్తి విజయాన్ని పొందాలి. సర్వశక్తివంతుడైన తండ్రి స్మృతి మరియు శ్రీమతముపై నడవటం ద్వారానే ఈ శక్తి లభిస్తుంది.

పాట:- దుఃఖితులపై దయ చూపించండి... (దుఖియో పర్ రెహమ్ కరో...)

ఓం శాంతి. ఆ తండ్రే కూర్చుని పిల్లలకు అర్థం చేయిస్తారు. ఆ తండ్రి ఎవరు? అది పిల్లలకు తెలుసు, తండ్రి ఎవరి సమ్ముఖంగా అయితే కూర్చున్నారో, ఆ పిల్లలకు తెలుసు. ఇప్పుడు పిల్లలైన మీ బుద్ధియోగము అనంతమైన తండ్రి వైపు ఉంది. బుద్ధియోగాన్ని ఇప్పుడు హద్దు తండ్రి నుండి తొలగించాలి. మొత్తము ప్రపంచములో మిత్ర-సంబంధీకులు ఎవరైతే ఉన్నారో వారిని, ఈ దేహాన్ని, ప్రపంచాన్ని అంతటినీ మర్చిపోవాలి. ఈ విధంగా తండ్రి డైరెక్షన్ లభిస్తుంది. తండ్రి పిల్లలను ఎప్పుడూ మర్చిపోరు. తండ్రి అంటారు - భక్తి మార్గంలో కూడా భక్తులైన మిమ్మల్ని నేను సంభాళిస్తూ వచ్చాను. కానీ డ్రామా అనుసారంగా పిల్లలైన మీరు అది మర్చిపోయేదే ఉంది. మరిపింపజేసేది మాయ. మేము ఆత్మలము - అనేది కూడా రావణుడు మరిపింపజేస్తాడు. దేహాభిమానులుగా చేస్తాడు. ఇది పిల్లలైన మీ పాత్ర. అలాగని మీరు అక్కడ కేవలం తండ్రిని మాత్రమే మర్చిపోతారని కాదు, కానీ వారు ఎవరు, ఎలా ఉన్నారు అంటూ ఆ తండ్రి స్మృతిని మరియు సుఖాన్ని ఇచ్చే జ్ఞానాన్ని మర్చిపోతారు.

ఇప్పుడు మీకు తెలుసు - బాబా కల్ప-కల్పము వస్తారు. బాబా ఎటువంటివారు - ఇది కూడా బుద్ధిలో ధారణ చెయ్యాలి. మనుష్యులు శివలింగము చిత్రాన్ని పెద్దగా తయారుచేసారు. మిగిలినవారందరి చిత్రాలు బాగానే ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, శంకరుల చిత్రాలు కూడా బాగానే ఉన్నాయి, వారు మందిరాలలో పూజింపబడతారు. కానీ పరమపిత పరమాత్ముని నామము, రూపము, దేశము, కాలము ఏవైతే ఉన్నాయో, వాటిని మర్చిపోతారు. వారి చిత్రాన్ని కూడా మర్చిపోతారు. ఇప్పుడు పిల్లలైన మీకు - ఆత్మ బిందు రూపము అని అర్థం చేయించబడుతుంది. నక్షత్రము లాంటి బిందువు. భృకుటి మధ్యలో ఉంటుంది. మేము ఆత్మలము అని పిల్లలకు తెలుసు. శరీరములో భృకుటి మధ్యలో ఆత్మనైన నా యొక్క స్థానము ఉంది. ఇదైతే అందరూ ఒప్పుకుంటారు. ఆత్మ చాలా సూక్ష్మమైన బిందువు వంటిది. పరమపిత పరమాత్మ కూడా అటువంటి బిందు రూపము కలవారై ఉంటారని కూడా తెలుసు. వారు స్వయంగా వచ్చి అర్థం చేయిస్తారు - నేను కూడా బిందువును కానీ మనుష్యులు పెద్ద రూపాన్ని, జ్యోతిర్లింగాన్ని తయారుచేసారు. ఏ విధంగా బుద్ధుడికి కూడా చాలా పెద్ద రూపాన్ని తయారుచేస్తారు. పాండవుల శరీరాలను కూడా భక్తి మార్గంలో చాలా పొడవుగా తయారుచేస్తారు. భక్తి మార్గంలో పెద్ద చిత్రాలు ఉంటాయి. జ్ఞాన మార్గములో చిన్నవి ఉంటాయి. పరమాత్మ అంటారు - నేను బిందువును. అక్కడక్కడా చాలా పెద్ద లింగాలను కూడా పెడతారు. లేదంటే బిందువుకు పూజ ఎలా చేయగలరు. పూజ అయితే తప్పకుండా పెద్ద వాటికే జరుగుతుంది కదా. మీకు ఇప్పుడు బిందువు రూపము గురించి అర్థం చేయించారు. ఈ విషయాలను మనుష్యులు అర్థం చేసుకోలేరు. పిల్లలైన మీకు కూడా ఇంతకుముందు ఈ జ్ఞానం లేదు. ఇప్పుడు పరిపక్వ అవస్థకు చేరుకున్నారు కనుక ఇది యథార్థమైన విషయమని అర్థం చేసుకుంటారు. ఒకవేళ మొదటి నుండే బాబా అర్థం చేయించి ఉంటే, మనము అర్థం చేసుకోలేకపోయేవారము ఎందుకంటే బిందువు అనేది వస్తువేమీ కాదు. మనము ఒప్పుకునేవారము కాదు. పరంపరగా ‘శివలింగము’ అని అంటూ వచ్చారు, మరి అదేమిటి? అది కూడా తప్పు అని తండ్రి అర్థం చేయిస్తారు. మీకు తండ్రినైన నేను బిందువును. మీది కూడా బిందు రూపమే. కానీ పూజ మొదలైనవాటి కొరకు పెద్ద శివలింగాన్ని తయారుచేస్తారు. ఆత్మల రూపాన్ని కూడా సాలిగ్రామాలుగా తయారుచేస్తారు కానీ అలా ఉండరు. ఆత్మ ఇంత పెద్దగా ఉండదు. ఆత్మ అతి కష్టము మీద కనిపిస్తుంది. ఇవి అర్థం చేసుకోవలసిన చాలా గుహ్యమైన విషయాలు. ఆత్మ కూడా బిందు రూపము. ఈ చిన్న ఆత్మలో 84 జన్మల పాత్ర ఉంది. ఒక క్షణము మరొకదానితో కలవదు. 84 జన్మల పాత్ర అంతా ఒక్క చిన్న ఆత్మలో నిశ్చితమై

ఉంది. ఇది ప్రకృతిసిద్ధమైన విషయము. మొత్తము పాత్ర అంతా బిందువులో ఉంటుంది. ఆ నాటకములో కూడా పాత్రను అభినయించేవారి బుద్ధిలో మొత్తము పాత్ర అంతా ఉంటుంది కదా. అది చిన్న పాత్ర, ఈ 84 జన్మల పాత్రను కూడా మంచి రీతిలో అర్థం చేసుకోవాలి మరియు ఇది అర్థం చేయించేందుకు కూడా మంచి యుక్తి కావాలి. ఇంత చిన్న బిందువు, ఎంత చిన్నది, ఎంత శక్తివంతమైనది! వారిని పరమపిత పరమాత్మ అని అంటారు. ఆత్మలైన మీరు వారితో యోగాన్ని జోడించటం ద్వారా మాస్టర్ సర్వశక్తివంతులుగా అవుతారు. మాయపై విజయాన్ని పొంది స్థిరమైన, అఖండమైన సుఖ-శాంతిమయమైన రాజ్యాన్ని పరిపాలిస్తారు. ఇవి ఎంతగా అర్థం చేసుకోవాల్సిన విషయాలు.

ఇది చదువు. ఇది చాలా సహజము కూడా. దీనిని తండ్రే అర్థం చేయించగలరు, మనుష్యులెవరూ అర్థం చేయించలేరు. వారు ఇంత చిన్నని బిందువు కానీ 'జ్ఞాన సాగరుడు' అంటూ పేరు ఎంత పెద్దగా పెడతారు. వారు మనుష్య సృష్టికి బీజరూపుడు, చైతన్యము, సత్యము, అవినాశీ అని మీరు అంటారు. అలా అంటూ వచ్చారు కానీ వారు ఎవరు అన్నది ఎవరి బుద్ధిలోకి రాదు. వారి గుణాలనైతే లెక్కలేనంతగా గాయనం చేస్తారు. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రి సమ్ముఖంలో కూర్చున్నారు, వారిని తెలుసుకున్నారు. ఆత్మలైతే సమ్ముఖములోనే ఉన్నారు. ఆత్మలందరూ పరస్పరంలో సోదరులే. ఎంత చిన్న-చిన్నని బిందువులు, ఆలోచించండి. మూలవతనము యొక్క చిత్రాన్ని ఏదైతే మనం తయారుచేస్తామో, అందులో బిందు రూపాన్నే చూపిస్తారు. ఏ విధంగా నక్షత్రాలు ఆకాశ తత్వంలో పైన నిలిచి ఉన్నాయో, అలాగే మహతత్వములో కూడా మనము అలా నక్షత్రాల వలె మన-మన సెక్షన్ల లో నిలిచి ఉంటాము. చిన్న-చిన్న నక్షత్రాలతో వృక్షము తయారుచేయబడి ఉంది. అక్కడ నుండి మళ్ళీ ఆత్మ వస్తుంది, పాత్రను అభినయించేందుకు శరీరాన్ని ధారణ చేస్తుంది. ఆత్మలన్నీ నంబరువారుగా ఎలా వస్తాయి - ఇదంతా బుద్ధిలో నడవాలి. ప్రతి ధర్మము వారి సెక్షన్ వేరుగా ఉంటుంది. తండ్రి ఉదాహరణ ఇస్తూ అర్థం చేయిస్తారు. మర్రి చెట్టు ఉదాహరణ కూడా అర్థం చేయిస్తారు. హిందీ చాలా చోట్ల నడుస్తుంది, కావున పిల్లలు హిందీ భాషలో అర్థం చేయించవలసి ఉంటుంది. పరమపిత పరమాత్మ కూడా హిందీ భాషలోనే అర్థం చేయిస్తారు. ఈ రోజుల్లో ప్రతి చోట దీని గురించి ప్రచారము చేస్తూ ఉంటారు. ఒకే భాష ఉండటమనేది కష్టము. చాలా మంది - పరమపిత పరమాత్మకైతే అన్ని భాషలు తెలిసి ఉండవచ్చు అని అనుకుంటారు. కానీ అలా ఉండదు. లెక్కలేనన్ని, అనేకానేక భాషలు ఉన్నాయి. వాటిని నేర్చుకోవలసి ఉంటుంది. పరమపిత పరమాత్మకు ఏమీ నేర్చుకోవాల్సిన అవసరం ఉండదు. వారు కల్పక్రితం ఏ భాషలో అర్థం చేయించారో, ఆ భాషలోనే అర్థం చేయిస్తారు. భాషలనైతే ప్రతి ఒక్కరూ నేర్చుకోవలసి ఉంటుంది. తండ్రి నేర్చుకోవలసి ఉంటుందా? మొదట నుండి హిందీయే కొనసాగుతూ ఉండడాన్ని మీరు చూసారు. అందరూ హిందీ నేర్చుకుంటూ ఉంటారు. భారత్ లో హిందీ ప్రచారములో ఉంది. తండ్రి కూడా హిందీలో అర్థం చేయిస్తారు, ఆ తర్వాత ప్రతి ఒక్కరూ తమ-తమ భాషల్లోకి అనువాదం చేసి ఇతరులకు అర్థం చేయించవలసి ఉంటుంది. తండ్రి మరియు తండ్రి రచన యొక్క పరిచయాన్ని అందరికీ అర్థం చేయించాలి. అందరి సద్గతిదాత ఆ తండ్రి ఒక్కరే. తప్పకుండా తండ్రి వచ్చి ఉన్నారని అందరూ తెలుసుకుంటారు. తండ్రి అంటారు - నేను భారత్ లోనే వస్తాను, భారత్ నా జన్మ స్థానము. శివుని మందిరాలు, దేవీ-దేవతల మందిరాలు కూడా ఇక్కడే ఉన్నాయి. దేవీ-దేవతల రాజ్యము కూడా భారత్ లోనే ఉంటుంది. తండ్రి కూడా భారత్ లోనే వస్తారు. దేవీ-దేవతా ధర్మ స్థాపనను ఇక్కడే చేసారు. కావున మందిరాలు కూడా తప్పకుండా ఇక్కడే ఉండాలి. ఇతరులకు ఇన్ని మందిరాలు ఉండవు. ఇక్కడైతే ఎన్నో మందిరాలు ఉన్నాయి. ప్రతి ఇంటిలో లక్ష్మీ-నారాయణుల చిత్రాన్ని, రాధే-కృష్ణుల చిత్రాన్ని, సీతా-రాముల చిత్రాన్ని పెట్టుకుంటారు ఎందుకంటే వారు ఒకప్పుడు భారత్ లో ఉండేవారు. కానీ వారు రాజ్యాన్ని ఎలా తీసుకున్నారు - ఇది మర్చిపోయారు. చైతన్యంలో రాజ్యము చేసి వెళ్ళారు. లక్ష్మీ-నారాయణులు వైకుంఠము యొక్క మహారాజు-మహారాణి. వారు రాజ్యము చేసి ఎంత సమయం గడిచింది? ఇది కూడా తెలుసు. క్రైస్టుకు 3000 సంవత్సరాల పూర్వం దేవీ-దేవతల రాజ్యముండేది అని నోటితో అంటూ ఉంటారు కూడా. మరి క్రైస్టు వచ్చి 2000 సంవత్సరాలు అయ్యింది కదా. కావున ఎవరైతే అలా అంటారో వారికి ఆ విషయముపైనే అర్థం చేయించాలి. క్రైస్టుకు 3000 సంవత్సరాల క్రితం దేవీ-దేవతల రాజ్యముండేది అనగా స్వర్గముండేది అని అంటారు. అలాగని క్రైస్టు కూడా ఆ స్వర్గములో ఉండేవారని కాదు. క్రిస్టియన్లు ఆ సమయములో ఎక్కడ ఉండేవారు అని ప్రశ్నిస్తారు. అనగా వారి ఆత్మలు ఎక్కడ ఉండేవి? ఇస్లాములు, బౌద్ధులు, క్రిస్టియన్లు మొదలైనవారి ఆత్మలన్నీ ఎక్కడ ఉండేవి? ఇది అర్థం చేయించటం చాలా సహజము. వారందరూ నిర్వాణధామములో, ఆ నిరాకారీ ప్రపంచములో ఉండేవారు. నిరాకారీ ప్రపంచము కూడా ఉంది, ప్రపంచములో నివసించేవారు తప్పకుండా ఎంతోమంది ఉంటారు. ఆత్మలందరి నివాస స్థానము మహతత్వము రూపీ నిరాకారీ ప్రపంచములో ఉంది. ఈ సమయంలో దేవీ-దేవతల ఆత్మలన్నీ హాజరై ఉన్నాయి అని, ఇప్పుడే తండ్రి వచ్చారు అని, మళ్ళీ దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తారు అని పిల్లలైన మీ బుద్ధిలో ఇప్పుడు ఉంది. ఏ ధర్మము వచ్చినా కానీ మొదట చాలా చిన్నగా

ఉంటుంది, ఎప్పుడైతే చిన్న-చిన్న శాఖలు వెలువడి అంతా పూర్తవుతుందో, అప్పుడు మీ ఈ ఫౌండేషన్ కూడా పూర్తవుతుంది.

బీజము మరియు వృక్షము యొక్క రహస్యాన్ని అర్థం చేయించడము చాలా సహజము. మనుష్య సృష్టి రూపీ వృక్షము ఎన్నో ధర్మాలకు సంబంధించింది. ఫలానా ధర్మము ఉండేది అని, ఫలానా ధర్మము ఉండేది కాదు అని కూడా అర్థం చేసుకుంటారు. ఇప్పుడు చిన్న-చిన్న ధర్మాలు వెలువడుతాయి. అవి ఇంతకుముందైతే లేవు కదా. చిన్న-చిన్న శాఖలైతే ఇప్పుడు వెలువడ్డాయి. ఇది పిల్లలైన మీకు తెలుసు, ఇంకెవరికీ తెలియదు. ఆత్మ మరియు పరమాత్మల బిందు రూపము గురించి తెలియదు. ఇప్పుడు బాబా వచ్చి పిల్లలైన మీకు అర్థం చేయించారు. మీరు అంటారు - బాబా, మేము మీ పిల్లలము, కల్పక్రితం కూడా మిమ్మల్ని కలిసాము, మీ పిల్లలుగా అయ్యాము. తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు పిల్లలుగా అవుతారు. తండ్రి అంటారు - మీరు నా వారు, అనగా దత్తత తీసుకున్నాము, ముఖవంశావళిగా అయ్యారు. మీరందరూ దత్తత తీసుకోబడినవారు. బాబా కూడా బ్రహ్మా ముఖము ద్వారా - ఆత్మలైన మీరు నా వారు అని అంటారు. ఆత్మలైన మీరు కూడా అంటారు - బాబా, మీరు బ్రహ్మా తనువులోకి వచ్చి మీ పరిచయాన్ని ఇచ్చారు, నేను మీ వాడిని. బాబా అని అనటంతోనే వారసత్వపు సుగంధము రావాలి. పిల్లలే అలా అనగలరు. ఇది ప్రవృత్తి మార్గము. సన్యాసులకు శిష్యులుగా అవుతారు, వారు తండ్రి-పిల్లలుగా అవ్వరు. తండ్రి నుండి సంపద యొక్క వారసత్వం లభిస్తుంది. మేము గురువును ఆశ్రయించాము అని శిష్యులు అంటారు. గురువు నుండైతే సంపద యొక్క వారసత్వం లభించదు. వారైతే సంపదను వదిలి అడవులలోకి వెళ్ళిపోతారు. వారు సంపదను ఇవ్వలేరు. వారు నివృత్తి మార్గము వారు. తండ్రి అయితే సంపదను ఇస్తారు, గురువుల నుండైతే ఏమీ లభించదు. అడవులలోకి వెళ్తే సన్యాసిగా పిలువబడతారు. మీరు కూడా సన్యాసిగా పిలువబడతారు. వారు హఠయోగీ సన్యాసులు. మీరు రాజయోగీ సన్యాసులు. సన్యాసి అనగా 5 వికారాలను త్యాగము చేసేవారు. ఆ త్యాగాన్ని మీరు చేస్తారు, ఆ తర్వాత పవిత్ర ప్రపంచములోకి వెళ్ళిపోతారు. వారు త్యాగము చేస్తారు కానీ పవిత్ర ప్రపంచములోకి వెళ్ళరు, పతిత ప్రపంచములోనే ఉంటారు.

తండ్రి అర్థం చేయిస్తారు - ఆత్మ ఎంత చిన్నది. ఇంత చిన్న వస్తువులో ఎంతటి శక్తి ఉంది, అది అవినాశీ కూడా. ఆ తండ్రి ఈ శరీరము ద్వారా అర్థం చేయిస్తారు, మీ ఆత్మ అర్థం చేసుకుంటుంది. తండ్రి అంటారు - నేను కలియుగ అంతిమములో, అందరూ తమోప్రధానులుగా, పతితులుగా అయిపోయినప్పుడు వస్తాను. నన్ను గుర్తు చూసుకోవడం కూడా సంగమములోనే గుర్తు చేసుకుంటారు, అప్పుడే నేను వస్తాను, అప్పుడే వినాశనం గుర్తులు కూడా కనిపిస్తాయి. వాటిని మీరు తప్పకుండా చూస్తారు. ఇప్పుడు మీకు వివేకము లభిస్తుంది, దానిని మళ్ళీ ఇతరులకు ఇవ్వాలి. ఇప్పుడిది తప్పకుండా కలియుగ అంతిమము. యాదవులు, కౌరవులు, పాండవులు కూడా ఉన్నారు. మహాభారత యుద్ధము కూడా ఉంది. తప్పకుండా, ఆ సమయములో రాజయోగాన్ని కూడా నేర్చుకునేవారు. పాండవులు విజయాన్ని పొందారు, యాదవులు-కౌరవులు వినాశనమయ్యారు. స్వర్గములో ఒకే ధర్మము ఉంటుంది. అనేక ధర్మాలు సమాప్తమైపోతాయి. ఇది తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు. బాబా నేర్పించే ఈ రాజయోగ శిక్షణ ద్వారా మేము తప్పకుండా మళ్ళీ దేవీ-దేవతల పదవిని పొందుతామని పిల్లలకు తెలుసు. మీరు నరుని నుండి నారాయణునిగా అయ్యేందుకే పురుషార్థం చేస్తారు. తప్పకుండా తండ్రికి వారసులుగా, సింహాసనాధికారులుగా అవుతారు. ఇక ఎవరెంత పురుషార్థము చేస్తే అంతటి పదవిని పొందుతారు. పురుషార్థం చేసేవారు దాగి ఉండరు, వారు చాలా ఆనందంలో ఉంటారు. మొట్టమొదటగా ప్రతిజ్ఞ చేస్తారు. తండ్రి జన్మ జరిగిన తరువాత రక్షాబంధనము ఉంటుంది. తండ్రిని తెలుసుకున్నారు కనుక మొదట ప్రతిజ్ఞ చెయ్యాలి. తండ్రి అంటారు - కామము మహాశత్రువు. దానమైతే పంచ వికారాలనూ చెయ్యాలి కానీ మొట్టమొదట ముఖ్యమైనది కామము, దీనితో చాలా జాగ్రత్తగా ఉండాలి. పత్నితో పాటు కలిసి ఉంటున్నా, గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రంగా ఉండటము అనేది శ్రమతో కూడుకున్నది. సర్వశక్తివంతుడైన తండ్రిని స్మృతి చెయ్యటం ద్వారా మరియు వారి శ్రీమతముపై నడవటము ద్వారా శక్తి లభిస్తుంది. తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - తోడుగా ఉంటూ, కలిసి ఉంటూ పవిత్రంగా ఉండాలి. ఇంతకుముందు స్త్రీ-పురుషులు కలిసి ఉండటం వలన నిప్పు అంటుకునేది. తండ్రి అంటారు, కలిసి ఉండండి కానీ నిప్పు అంటుకోకూడదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. హృదయపూర్వకంగా తండ్రిని స్మృతి చేసి సంపద యొక్క సంతోషములో ఉండాలి. పూర్తి పావనులుగా తప్పకుండా అవ్వాలి.

2. ''ఆత్మ ఎంత చిన్నది మరియు ఆత్మలో ఎంతటి అవినాశీ పాత్ర నిండి ఉంది'' అని ఆలోచించాలి, బిందువుగా అయ్యి బిందువైన తండ్రి యొక్క స్మృతిలో ఉండాలి.

వరదానము:- స్వ ఇచ్ఛ మరియు దృఢ సంకల్పముతో ఒకటి ఇచ్చి పదమాలను తీసుకునే వివేకవంతులుగా కండి

వివేకవంతులైన పిల్లలు మట్టితో నిండి ఉన్న అటుకులను ఇచ్చి ఒకటికి పదమాల రెట్ల భాగ్యాన్ని తయారుచేసుకుంటారు. కేవలం అటుకులను ఇస్తారు మరియు రిటర్న్‌లో సర్వ శక్తులను, సర్వ ఖజానాలను, 36 రకాల కన్నా ఎక్కువ వెరైటీలను తీసుకుంటారు. కానీ చాలా మంది పిల్లలు అది ఇచ్చే సమయంలో కూడా సుదాముని వలె పక్కన దాచిపెట్టుకుంటారు. తండ్రి దానిని లాక్కుని తీసుకోగలరు కానీ లాక్కుని తీసుకోవడం వలన దానికి రిటర్న్‌లో అంతగా లభించదు, అందుకే స్వ ఇచ్ఛ మరియు దృఢ సంకల్పముతో ఒకటి ఇచ్చి పదమాలు తీసుకోవడము - ఇదే తెలివైన పని. ఈ ఇవ్వడంలోనే కళ్యాణం ఉంది.

స్లోగన్:- సాక్షిగా అయి అతీతంగా ఉంటూ ప్రతి ఆటను చూసేవారే సాక్షీ దృష్టా.